
# ప్రజలే 'కొప్పుల' బలగం

**పరిగిలో 15 పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికలు**

**ఆరు సార్లు కొప్పుల కుటుంబానిదే విజయం**

పరిగి, నవంబర్ 17 : పరిగి నియోజకవర్గం ఏర్పడిన తర్వాత జరిగిన ఎన్నికల్లో అత్యధిక పర్యాయాలు 'కొప్పుల' కుటుంబం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందడం ద్వారా పరిగి గడ్డ కొప్పుల అడ్డాగా మారింది. అనునిత్యం ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉండడం ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ స్పీకర్ దివంగత కొప్పుల హరీశ్వర్‌రెడ్డి ఏకంగా అయిదు పర్యాయాలు పరిగి ఎమ్మెల్యేగా గెలుపొందగా 2018లో ఆయన కుమారుడు కొప్పుల మహేశ్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. పరిగి అసెంబ్లీ నియోజకవర్గం 1952లో ఏర్పడింది. ఇప్పటివరకు 15 పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికలు జరగగా 6 పర్యాయాలు కొప్పుల కుటుంబసభ్యులే ఎమ్మెల్యేగా గెలుపొందడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే 1952లో మొదటిసారి జరిగిన ఎన్నికల్లో ఎస్.జె.బేగం(కాంగ్రెస్ పార్టీ) ఏకగ్రీవంగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1957లో కె.జె.రెడ్డి(ఇండిపెండెంట్), 1962లో ఎం.ఆర్.రెడ్డి (కాంగ్రెస్), 1967లో కె.రాంరెడ్డి(ఇండిపెండెంట్), 1972లో కె.రాంరెడ్డి (కాంగ్రెస్ ), 1978లో అహ్మద్‌షరీఫ్ (కాంగ్రెస్ ఐ), 1983లో అహ్మద్‌షరీఫ్ (కాంగ్రెస్ ), 1985లో కె.హరీశ్వర్‌రెడ్డి (టీడీపీ), 1989లో కె.రాంరెడ్డి (కాంగ్రెస్ ), 1994లో కె.హరీశ్వర్‌రెడ్డి (టీడీపీ), 1999లో కె.హరీశ్వర్‌రెడ్డి ( టీడీపీ), 2004లో కె.హరీశ్వర్‌రెడ్డి (టీడీపీ), 2009లో కె.హరీశ్వర్‌రెడ్డి(టీడీపీ), 2014లో టి.రాంమోహన్‌రెడ్డి (కాంగ్రెస్), 2018లో కె.మహేశ్‌రెడ్డి(బీఆర్ఎస్)లు విజయం సాధించారు. ఇందులో 1985, 1994, 1999, 2004, 2009లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొప్పుల హరీశ్వర్‌రెడ్డి, 2018లో హరీశ్వర్‌రెడ్డి తనయుడు కొప్పుల మహేశ్‌రెడ్డి విజయం సాధించడం జరిగింది. తద్వారా పరిగి నియోజకవర్గంలో అత్యధిక పర్యాయాలు ఎమ్మెల్యేగా కొప్పుల కుటుంబం వారే గెలుపొందారు. పరిగి నియోజకవర్గంపై కొప్పుల కుటుంబానికి గల పట్టు నిరూపితమవుతుంది.



**ప్రజల నాయకులుగా 'కొప్పుల'**

పరిగి నియోజకవర్గంలో అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులుగా కొప్పుల కుటుంబ సభ్యులు పేరు తెచ్చుకున్నారు. స్వర్గీయ హరీశ్వర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉంటూ అయిదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందగా, ఎల్లప్పుడూ ప్రజల మధ్య లోనే ఉండేవారు. కాంగ్రెస్ హవా వీచిన ఎన్నికల్లోను పరిగిలో హరీశ్వర్‌రెడ్డి గెలుపొందడం గమనార్హం. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా నడుచుకునే హరీశ్వర్‌రెడ్డి 2012లో శాసన సభ్యత్వానికి సైతం రాజీనామా చేసి, తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ నాయకుడు కేసీఆర్ వెంట నడిచారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తోపాటు నడిచిన



కొప్పుల హరీశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే (ఫైల్)



కొప్పుల మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి

మొదటి నాయకుడిగా చెప్పుకోవచ్చు. ఇటీవల కులకచర్లలో జరిగిన రోడ్ షో సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా ప్రస్తావించగా, ప్రజల నుంచి చక్కటి స్పందన కనిపించింది. తండ్రికి తగ్గ తనయుడిగా, స్పార్క్‌టెక్ క్యారెక్టర్‌గా సీఎం కేసీఆర్‌చే పిలువబడిన కొప్పుల మహేశ్‌రెడ్డి 2018లో తొలిసారి పరిగి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఐదేండ్లుగా అనునిత్యం ప్రజలలోనే ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలు మొదలుకొని ఏ చిన్న శుభ కార్యక్రమం, ఇతర కార్యక్రమాలకు సైతం స్వయంగా హాజరవడం ద్వారా ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. పార్టీ అధిష్టానం సూచనలతో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాలు, పల్లె పల్లెకూ కొప్పుల కార్యక్రమంతో ప్రజలకు మరింత దగ్గరయ్యారు. పేదలు కార్పొరేట్ దవాఖానల్లో చికిత్స చేయించుకున్న వారికి పార్టీతో సంబంధం లేకుండా అన్ని వర్గాల వారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థికసాయం అందేలా చూశారు. నలభై సంవత్సరాలుగా కొప్పుల కుటుంబంతోనే కొనసాగుతున్న కార్యకర్తలు ఉండడం ద్వారా చక్కటి బలగం కలిగి ఉన్నారని చెప్పవచ్చు. దీంతోపాటు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిదిన్నర సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. అలాగే బీఆర్ఎస్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రతి గడపకూ తీసుకువెళ్లడం ద్వారా మరింత ఆదరణ పొందుతున్నారు. తద్వారా మరోసారి పరిగి గడ్డపై గులాబీ జెండా ఎగురవేసే విధంగా కొప్పుల అడుగులు వేస్తున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్

## కాలె యాదయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలి

**బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్**

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 17 : సీఎం కేసీఆర్ పాలనే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల పరిధి ఇబ్రహీంపల్లి గ్రామ రెవెన్యూలోని బర్కల రామ్‌రెడ్డి ఫామ్ హౌస్‌లో చటారి దశరథ్ స్థానిక నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ... యువతను రాజకీయంగా ప్రోత్సహిస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ పార్టీ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ఆ పార్టీ నాయకులు బీ - ఫామ్‌లను అమ్ముకుంటున్నారని ఎద్దేవా చేశారు. చేవెళ్ల శాసన సభ్యుడు, బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య హయాంలో చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతున్నదని తెలిపారు. ప్రజలు యాదయ్యను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెద్దొళ్ల ప్రభాకర్, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింహులు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్‌గౌడ్, నియోజకవర్గ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు అత్తెల్లి రాఘవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు మహేశ్వర్‌రెడ్డి, శాంత్‌కుమార్, లక్ష్మీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లిన విద్యార్థి అదృశ్యం



ఆకాశ్ (ఫైల్)

షాబాద్, నవంబర్ 17: ఈతకని వెళ్లిన విద్యార్థి అదృశ్యమైన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. షాబాద్ సీఐ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన సొన్నాయిల ఆకాశ్ (15) పదో తరగతి చదువుతున్నాడు. మూడు రోజుల నుంచి కనిపించకుండాపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. లక్ష్మారావుగూడ గ్రామ సమీపంలో ఉన్న పెద్ద క్వారీ గుంత వద్ద అతడి చెప్పులు, బైక్ ఉండడంతో ఈత కొట్టేందుకు వెళ్లి ఉండవచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎన్డీఆర్ఎస్ బృందంతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. అతడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## దివ్యాంగులు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

వికారాబాద్, నవంబర్ 17 : వికారాబాద్ జిల్లాలోని దివ్యాంగులందరూ స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగడానికి డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఎంతో ఉపయోగపడుతుందని ఫౌండేషన్ సభ్యులు లక్ష్మి, శ్రీనివాస్, ఉదయ్, రామేశ్వర్లు తెలిపారు. శుక్రవారం వికారాబాద్ స్త్రీ శక్తి భవనంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, సిడ్బి ఆధ్వర్యంలో జిల్లాలోని చిన్న చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న నిరుపేదలైనటువంటి దివ్యాంగులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. వారికి వారి ప్రతిభకు తగ్గట్టుగా వ్యాపారాలు, మెరుగైన జీవనోపాధిని పొందడానికి వికారాబాద్‌లో రెండు రోజులు ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులకు రూ.25 వేల ఆర్థిక సాయాన్ని 28మందికి అందజేసినట్లు తెలిపారు. ప్రతి నిరుపేద దివ్యాంగులను గుర్తించి వారికి ఆర్థిక సాయం అందించేలా కృషి చేస్తామని చెప్పారు.



శిక్షణ తరగతులకు హాజరైన దివ్యాంగులు

# సంక్షేమమే ప్రథమ లక్ష్యం



ప్రచారంలో పాల్గొన్న ఎంపీపీ భవాని, బీఆర్ఎస్ నేతలు (ఫైల్)


**బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్యను గెలిపించాలి**

**నవాబుపేట మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం**

**ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నేతలు**

నవాబుపేట, నవంబర్17 : సీఎం కేసీఆర్ అమలుజేస్తున్న సంక్షేమ పథకాలే శ్రీరామ రక్షగా బీఆర్ఎస్ నేతలు నవాబుపేట మండలంలోని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తూ ఓటర్ల వద్దకు వెళ్లి ఓటు అడుగుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలోని ప్రతి అంశాన్ని వివరిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రజలకు వివరిస్తున్నారు. తాగునీరు, సాగు నీటికి కొదువలేదని రైతులకు ఉచిత కరెంట్ ఇస్తూ కన్నీళ్లు తుడిచారని గుర్తుజేస్తున్నారు. మండలంలో ఉన్న 32 గ్రామపంచాయతీల్లో ప్రచారాన్ని వేగవంతం చేసి కాలె యాదయ్యను గెలిపించాలని కోరుతున్నారు. ఎంపీపీ, మార్కెట్ కమిటీ చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు కలిసి ఓటర్ల వద్దకు వెళ్తున్నారు. ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ప్రథమ లక్ష్యమని ప్రచారం చేస్తున్నారు. పాటల రూపంలో ఓటర్ల వద్దకు వెళ్లి గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, కార్యకర్తలు జరిగిన అభివృద్ధి పనులను చూపిస్తూ ఓటువేయాలని అభ్యర్థిస్తున్నారు. చిట్టిగిద్ద నుంచి చించల్‌పేటకు వెళ్లే మార్గంలో మూసీవాగుపై భారీ బ్రిడ్జిని నిర్మించి ఏండ్ల నాటి కలను నెరవేర్చారని పేర్కొన్నారు. గంగ్యాడ, గుల్లగూడ రైతాంగం కోసం మూసీ వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టి అన్ని కాలాల్లో పంటలు పండించుకునేందుకు వీలుగా సౌకర్యాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇంకుడు గుంతలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తున్నదన్నారు.

**ప్రతి గ్రామంలో మౌలిక సౌకర్యాల కల్పన**



ముఖ్యమంత్రి కేసీఆర్ మండలంలోని ప్రతి గ్రామానికి మౌలిక సౌకర్యాలను కల్పించారు. మండల కేంద్రంలో రైతులకు రైతుబంధు, రైతు బీమా, సకాలంలో ఎరువులు, విత్తనాలను అందజేస్తూ ప్రభుత్వం ప్రజల గుండెల్లో నిలిచిపోయింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఏక్‌మామిడి బంగారు మైసమ్మ ఆలయం నుంచి మైతాబ్‌ఖాన్ గూడ వరకు కూడా బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టింది.

-భవాని, ఎంపీపీ

**పార్టీ బలోపేతమే ధ్యేయం**



మండలంలోని ప్రతి గ్రామంలో ప్రచారం చేస్తూ అభివృద్ధి పనులు, మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నాం. ఏ గ్రామంలో చూసినా ప్రచార కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్యను మరోమారు దీవించాలని గ్రామగ్రామానికి వెళ్లి వాల్‌పోస్టర్లను పంచుతూ ప్రచారం చేపడుతున్నాం.

-కందాడ నాగిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు